
# మంచి మనుషులు

— మల్లాది వెంకట కృష్ణమూర్తి



శేషగిరి రావు గారు చదరంగం ఆడటానికి వచ్చి అప్పుడే మూడు రోజులు దాటి పోతోంది.

రోజూ ఆఫీసునుంచి నేను తిరిగి రాగానే ఆయన సిద్ధంగా ఉంటారు, చదరంగం ఆడటానికి, నా కోసం ఎదురు చూస్తూ. సాయంత్రం షికారుకి బయటికి వెళ్లను నేను. ఆయనతోటే ఎనిమిది గంటలిదాకా రెండు, మూడు ఆటలు ఆడతాను.

ఎనిమిది అవగానే ఆయన భార్య భోజనానికి పిలుస్తుంది. ఆటలో ఆయనదే పై చేయిగా ఉంటే వెంటనే భోజనానికి వెళ్లిపోతారు. ఆటలో నాది పై చేయిగా ఉంటే, వెంటనే భోజనానికి కదలకుండా అలాగే కూర్చుంటారు, ఆట ఎలా కాపాడుకోవాలా అని.

ఆయన భోజనానికి లేవగానే నేను గదికి తాళం వేసి వెంటనే హోటల్‌కి వెళతాను, భోజనానికి, ఇంకా బ్రహ్మచారినే కాబట్టి.

నేను హోటల్ నుంచి తిరిగి వచ్చేటప్పటికి శేషగిరిరావుగారి భోజనం అయిపోతుంది. 'మళ్లీ ఓ ఆట వేద్దామా' అంటారు ఉత్సాహంగా.

సిగరెట్, పేకాట, తాగుడు, జూదం లాగా చదరంగం కూడా ఓ వ్యసనం లాంటిది. ఆ ఆట ఆడడం చేతనై, ఆడేవాళ్లు దగ్గరుంటే, అది ఆడకపోతే ఉండటం కష్టం అని అనుభవం మీద తెలుసుకున్నాను నేను. శేషగిరిరావుగారు కూడా అదే అంటారు.

నేను ఎప్పుడయినా ఆఫీసునుంచి ఆలస్యంగా రావటం జరిగితే ఎందుకు ఆలస్యం అయిందని అడుగుతారు. 'వెధవది. ఈ ఆట మా ఇంట్లో ఆ ఇద్దరికీ రాదోయ్. నేర్పుతే నేర్చుకోరు' అంటూ విసుక్కుంటాడు.

అలాంటి శేషగిరిరావుగారు ఈ మూడు రోజుల నుంచి రావటం లేదు, నేను సాయంత్రం ఆఫీసునుంచి తిరిగి రాగానే, చదరంగం ఆట ఆడటానికి. కారణం అంతుపట్టలేదు నాకు.

ఈ మూడు రోజుల నుంచి శేషగిరి రావుగారి ఇంట్లో ఏదో జరుగుతూందని గ్రహించగలిగాను నేను. నా వంక చూసినప్పుడు ఆ ఇంట్లోని ముగ్గురూ ముఖాలు ముడుచుకోవటం గమనించాను.

వసుంధర!

వసుంధర కూడా కనపడటం లేదు నాకు ఈమధ్య సరిగ్గా. ఈ మూడు రోజుల్లో నాలుగయిదు సార్లు వెళ్లాను నేనే వాళ్లింటికి. కాని, ఎవరి ముఖాల్లోనూ చిరునవ్వు లేదు ఎప్పటి మాదిరి. మనసు విప్పి మాట్లాడే వసుంధర అసలు నా వంకే చూడటం లేదు.

వాళ్ళకి ఏమయిందో ఊహించలేక పోయాను. అడుగుదామంటే అవకాశం ఇష్టంలేదు వసుంధర. నా గదికీ, వాళ్ళ ఇంటికీ మధ్య స్లైవుడ్ పార్టిషన్ మాత్రమే అడ్డు. వాళ్ళలో వాళ్ళు రహస్యంగా చర్చించుకుంటున్న విషయాలూ, గుసగుసలూ అస్పష్టంగా వినపడుతున్నాయి.

అసలు ఏం జరుగుతూంది? ఏమీ తెలియటం లేదు నాకు. శేషగిరి రావు గారు చాలా మంచి మనిషి. ఆయన భార్య ఇంకా మంచి మనిషి. వసుంధర మంచిదే కాదు, నా కళ్ళకి అందమయినది కూడా. అందుకే వసుంధర అంటే నాకు ఇష్టం.

శేషగిరి రావుగారు ఎంత మంచి మనిషంటే, ఎంత నీతికి కట్టుపడే మనిషంటే, ఎక్సయిజ్ కమిషనర్ ఆఫీసులో పదహారేళ్ళ నుంచి పనిచేస్తున్నా, ఆయనకి ఇంతవరకూ సొంత ఇల్లు లేదు. బాంక్ బాలన్స్ లేదు. భార్య మెడలో గాని, చెల్లెలు వసుంధర మెడలో గాని నగలు లేవు. ఇంట్లో హార్డ్ కాష్ లేదు వేల సంఖ్యలో. ఇంటి ఖర్చు నెలకి ఆయన జీతం ఎంతో అంతకి మించదు.

చాలామందిలాగ ఆయన అడ్డు దారులు తొక్కలేదు, నిక్కచ్చి మనిషి కనక. ఆ సంగతే అంటూంటాను నేను అప్పుడప్పుడూ నవ్వుతూ.

"ఆ ఉద్యోగం నాకుంటే, ఈపాటికి రెండు పెద్ద మేడలు కొనేసే వాణ్ణి."

ఆయన నవ్వి సమాధానం చెబుతారు.

"మనిషికి కావలసింది, ముఖ్యమయింది నీతి, మంచి. ఆ రెండూ వదులుకున్న వాడు మనిషే కాడు. జంతువుతో సమానం."

శేషగిరిరావు గారికి తల్లిదండ్రులుగానీ, దగ్గర బంధువులు గానీ ఎవరూ లేరు, ఒక్క వసుంధర తప్పితే. వసుంధర శేషగిరి రావు ఒకే ఒక్క చెల్లెలు. తల్లిదండ్రులు పోయిన ఆరేళ్ల తరవాత చేరారు ఉద్యోగంలో. అప్పటినుంచీ వసుంధరకి అన్నీ ఆయనే.

నేను ఆ గది, అద్దె ఎక్కువయినా, తీసుకోవడానికి కారణం వసుంధరే, నిజానికి.

బ్రహ్మచారిగాణ్ణి. బ్రహ్మచారుల కోసం కట్టబడినట్టుగా ఉంది ఆ గది. ఆ సందు నిండా అందమయిన ఆడపిల్లలే. ప్రేమించాలి అనుకునే వయస్సు. ప్రేమించడానికి తగిన వాళ్ళు కావాలిగా మరి?

వసుంధర చాలా నెమ్మదస్తురాలు. మంచిది. ప్రేమించడానికి తగ్గ అందం, చదువు, సంస్కారం, లక్షణాలు ఉన్నాయి వసుంధరలో. ప్రయత్నం ప్రారంభించాను.

కళ్లతో చూసుకోవడం, తరవాత కళ్ళతో మాట్లాడుకోవడం, ఇంకా ఆ తరవాత పుస్తకాలు, నవలలు మార్చుకోవడం, చివరికి ఇంట్లో వసుంధర అన్నా, వదినలకి తెలియకుండా సినిమాలకి వెళ్లడం, రహస్యంగా కలుసుకోవడం దాకా వచ్చింది మా ప్రేమ.

అందరిలాగానే వసుంధర ముందర ప్రేమ, ప్రేమ అనేది. ఇప్పుడు పెళ్లి, పెళ్లి అంటూంది. అదే నాకు ఇబ్బందిగా ఉంది. ప్రేమించగానే పెళ్లి చేసుకోవాలని ఎక్కడా లేదే? చూస్తాను అనే సమాధానమే ఇస్తున్నాను.

మా ప్రేమకి, వాళ్ల ముభావానికి కారణం ఉందా? ఏమో? ఉంటే చచ్చామే. అయినా ఆ సంగతి తెలుస్తే నన్ను సూటిగా అడిగేవారే శేషగిరి రావుగారు. అది అయి ఉండదు.

వసుంధరను ఒంటరిగా కలుసుకుని ఎలాగయినా ఏం జరిగిందో తెలుసుకోవాలనే నిశ్చయానికి వచ్చాను.

ఆ రోజు సెకండ్ శాటర్ డే. నాకు ఆఫీసు లేదు. సెలవు. అందుకనే రోజులా ఆరింటికే మెలకువ వచ్చినా లేవకుండా, బద్ధకంగా పడుకునే ఉన్నాను పక్క మీదే, గోడకి వేలాడుతున్న సినిమాతార కేలండర్ వంక చూస్తూ.

నెమ్మదిగా మొదలయిన శేషగిరిరావు గారి గొంతు క్రమంగా పెరుగుతూంది. గట్టిగా అరుస్తున్నారు ఆయన ఎవరి మీదో.

ఆయన అరుపులు వింటూంటే ఆశ్చర్యం వేసింది నాకు. ఆయనకి కోపం అంటే ఏమిటో తెలియదని నా ఉద్దేశం. కనీసం ఆయన ఎవరిమీద అయినా విసుక్కోగా కూడా చూడలేదు నేను.

ఆయన అరుపులు ఇంకా పెద్దవటంతో లేచి చూశాను, కిటికీ దగ్గిరకి వెళ్లి.

శేషగిరి రావుగారు వరండాలో నిలుచుని అరుస్తున్నారు గట్టిగా, భార్యవంక చూస్తూ. ఆయన భార్య వీధి గుమ్మం దగ్గర నిలబడి ఏడుస్తూంది వెక్కి వెక్కి.

ఆశ్చర్యం వేసింది నాకు. నమ్మలేక పోయాను, చూస్తున్నా కూడా.

"ఛీ! ఎంత పాడు పని చేశావు! ఇంత నీచురా లనుకోలేదు ఎప్పుడూ."

తల వంచుకుని ఏడుస్తూంది ఆవిడ.

"వంశ గౌరవం మంట గలిపావు. ఇంత అప్రాచ్యపు పని ఎలా చేయ బుద్ధయింది?"

నేను గబగబా మొహం కడుక్కుని బయటికి వచ్చాను, వరండాలోకి.

"ఏమిటి, మాస్టారూ, ఏమయింది?" అడిగాను శేషగిరిరావుగారి దగ్గిరికి వెళ్లి.

"నిజం. నే నేం ఎరగను. నాకేం తెలియదు."

ఏడుస్తూంది వసుంధర వదిన.

"ఏమీ తెలియకపోతే మూడు నెలల కడుపు ఎక్కడ నుంచి వచ్చింది?" గర్జించారు శేషగిరిరావుగారు, నిప్పులు కక్కేలా చూస్తూ.

నిర్ఘాంతపోయాను నేను ఆయన మాటలు విని.

"ఏమిటి? ఏం జరిగింది?" అడిగాను మళ్ళీ.

అప్పటికే ఆ సందులోని చుట్టు పక్కల ఇళ్ళ వాళ్ళు బయటికి వచ్చి చూస్తున్నారు వేడ్కం. కొంతమంది వీధి గుమ్మం బయట నిలబడి చూస్తున్నారు.

"దీనికి ఇప్పుడు మూడవ నెల." శేషగిరిరావుగారు రొప్పుతూ చెప్పారు.

"నిజంగా నాకు తెలియదు. నే నే పాపం ఎరగను."

చేతులు ఎత్తి దణ్ణంపెట్టింది భర్తకి.

నమ్మలేక చూస్తూ ఉండిపోయాను నేను. జరుగుతున్నది. వీధి గుమ్మం దగ్గర నిలబడ్డ వాళ్లలో ఒకరు లోపలికి వచ్చి అడిగారు శేషగిరిరావు గారిని.

---

# జయ! భారత భాగ్యేందిరా! జయ!

**పి. గణపతి శాస్త్రి**

జయ! భారత భాగ్యేందిరా! జయ!
జయ! జనానీక విజయేందిరా! జయ!

• • •

భూ నభోంతరాళం భోరుమని దద్దరిల్లేటట్టు
ప్రజాస్వామ్యమనీ, ప్రజా ప్రజాస్వామ్యమనీ
ప్రపంచంలో నలువైపుల అదే పనిగా
గొంతులెత్తి ఉద్ఘోషిస్తున్న
అగ్రరాజ్యాలు రెండు మహోగ్రాహంకారాలతో
ఎదిరించి, బెదిరించి హుమ్మని హుంకరించినా సరే,
పాక్ దారుణ దౌర్జన్యాగ్నిజ్వాలలో నుండి,
భయంకర క్రూర నరకయాతనల కీలలలోనుండి,
ప్రఫుల్లమై, సర్వస్వతంత్రమై ప్రభవించిన
బంగారుపద్మం బాంగ్లాదేశం నీ కీనాడు
నిండుగర్వంతో, విజయోల్లాసంతో, వీరావేశంతో
నివాళు లెత్తి, జేజే లర్పించి వేనోళ్ల వినుతించింది!
జయ! హిమాద్రి శిఖరాగ్ర ప్రతిధ్వనిత కీర్తీ! జయ!
జయ! మా మహనీయ జాతి రత్న మూర్తీ! జయ!

• • •

భారతీయ ప్రజాహృదయమే మహాసాగరమై
హోరుమని మార్మ్రోగింది నీ ధీర గభీర శౌర్యోత్సాహంతో
పల్లె పల్లెలలో, రచ్చపట్టులలో
పట్టణాలలో, పేటలలో, బాటలలో — ప్రతి చోట,
ప్రతి నోట నిండు గుండె లోలోపలి లోతులలో నుండి
ఒకే ఒక్క మాట! ఒకే ఒక్క జేగంట!
జయ! పరిపూర్ణ మానవతా విజయేందిరా! జయ!
జయ! విశాల భారత విజయేందిరా! జయ!

★



"ఏమయింది? ఎందుకలా శోకం చేస్తున్నావు?"

"ఏమయిందా? అడగండి చెప్తుంది. మూడు నెలల కడుపు ఇప్పుడు."

"అయితే?"

"అయితే ఏమిటి నా రాత! నేను ఆపరేషన్ చేయించుకుని సంవత్సరం దాటింది."

"నిజంగా?"

శేషగిరిరావుగారి భార్య వంకచూశాను. మోచేతులు మొహానికి అడ్డం పెట్టుకుని వెక్కి వెక్కి ఏడుస్తూంది.

"ఆపరేషన్ సక్సెస్ అయి ఉండదు. మీరు తొందరపడకండి. ఇలా చాలా సార్లు ఆపరేషన్ ఫెయిల్ అయిన సంఘటనలున్నాయి" అన్నాను నేను శేషగిరిరావు గారితో.

"ఆపరేషన్ ఫెయిల్ కాలేదూ, వల్లకాదూ కాలేదు. ముగ్గురు డాక్టర్లని కన్సల్ట్ చేశాను."

"ఇంకో డాక్టరు దగ్గిర పరీక్ష చేయించండి మళ్లీ. ఆవిడ అలాంటి మనిషి కాదు." చెప్పాను నమ్మకంగా.

"అవును. ఆవిడ చాలా ఉత్తమురాలు. సాధ్వి." వంత పాడారు పక్కవాళ్ళు.

"నేను ఒప్పుకోను. ఈ రోజుతో నాకూ దానికీ సంబంధం తీరిపోయింది. విడాకులకి అప్లికేషన్ పడేస్తాను వెంటనే."

"తొందరపడకండి. నెమ్మదిగా ఆలోచించి అన్నీ చేయచ్చు. మీ రింట్లోకి వెళ్లండి" అన్నాను నేను.

గుమ్మం చాటున నిలబడిఉన్న వసుంధర కూడా వెక్కివెక్కి ఏడుస్తూంది, నోట్లో చెంగు కుక్కుకుని.

"ఒప్పుకోను. ఛస్తే ఒప్పుకోను. వెంటనే మీ పుట్టింటికి వెళ్లిపో."

లోపలనుంచి నల్లరంగు సూట్ కేస్ తీసుకువచ్చి బయటికి గిరా టేశారు, భార్య ముందర పడేటట్లుగా, శేషగిరి రావుగారు.

"ఇంక నీతో ఛస్తే కాపరంచెయ్యను. చెస్తే ఒట్టు. వెళ్లిపో నా కళ్లముందు నించి."

ఆయన రౌద్రాకారం చూసి అందరూ హడలిపోయారు.

"ఎలా తెలిసింది మీ కీ సంగతి?" అడిగాను ఆయన్ని.

"చెప్పింది."

---

వన్నెల రాణి

చిత్రం—పి. ఆగాచార్య (కరీంనగర్)

**మనిషికి కావలసినవి. ముఖ్యమయినవి నీతి. మంచి. ఆ రెండూ వదులుకున్నవాడు ఒక్క మాటలో చెప్పాలంటే జంతువుతో సమానం. స్వార్థం మనిషి చుట్టూ తిరిగేసుకుని కూర్చుంటే మంచి బయటపడే మార్గం మూసుకొంటుంది. నీతి నశిస్తుంది. మనిషే మనిషి కాకుండా పోతాడు.**

"మీరు బాగా తొందర పడుతున్నారు" అన్నాను, బుజ్జగింపు ధోరణిలో.

"దయచేసి ఈ విషయంలో నువ్వు ఏమాత్రం జోక్యం కల్పించుకోకు" అన్నారు శేషగిరిరావు కటువుగా.

వసుంధర ముందుకు వచ్చి అన్నది.

"నేను వెళతాను వదినతో. వాళ్ళింట్లో దింపేసి వస్తాను."

"నువ్వెక్కడికి? గడప దాటితే కాళ్ళు విరగ కొడతాను."

అరిచారు శేషగిరిరావుగారు.

"పాపం వదిన ఒక్కతే ఎలా వెళ్ళగలుగుతుంది? ఎప్పుడయినా ఒక్కతే ప్రయాణం చేసిందా?" అన్నది వసుంధర.

"నువ్వు కలుగ చేసుకోడానికి వీల్లేదు. లోపలికి పో."

"దింపి వెంటనే వచ్చేస్తాను."

"ఈ గడప దాటితే మళ్ళీ నా ఇంట్లోకి రావడానికి వీల్లేదు."

**పదిమంది నచ్చ చెప్పిన తరవాత కొంచెం శాంత పడ్డారు శేషగిరిరావుగారు. వసుంధర కూడా వెళ్ళడానికి సమ్మతించారు.**

బయట అంగీ గోలచేస్తున్న వాళ్ళలో కొందరు రిక్షా వాళ్ళు కూడా ఉన్నారు.

ఓ రిక్షాలో ఎక్కి వెళ్ళిపోయారు వసుంధర, వసుంధర వదినా స్టేషన్‌కి.

శేషగిరిరావుగారు లోపలికి వెళ్ళి తలుపు వేసేసుకున్నారు.

చుట్టుపక్కల ఇళ్ళలో వాళ్ళు తలో విధంగా మాట్లాడుకుంటూ వెళ్ళిపోయారు నెమ్మదిగా. కొంతమంది శేషగిరి రావుగారి భార్య చాలా మంచిదని, శేషగిరి రావుగారే తొందర పడ్డారని అనుకున్నారు. కొంతమంది 'ఆవిడ ఇలాంటి మనిషని కలలో కూడా అనుకోలేదు' అంటూ మూతి విరిచారు.

నేను గదిలోకి వెళ్ళాను. చాలా మంది అనుమానం నా మీదికి వెళ్ళిందని గ్రహించాను. కాని నేను నిజం చెప్పి నమ్మరు. ఎందుకు నమ్ముతారు? వయసులో ఉన్న బ్రహ్మచారిగాణ్ణే గదా?

వసుంధరకూడ నన్ననుమానించిందా? మరి దేనికంత కోపంగా చూసింది, తినేసేటట్లుగా?

వసుంధర వదిన అలాంటిదంటే నిజంగా నమ్మలేకుండా ఉన్నాను. అలాంటి మనిషయితే ఇట్టే కనుక్కునే వాణ్ణి. ఏమో? అయినా ఏం జరిగిందో?

నిజంగా ఆవిడ అలాంటి మనిషయితే? ముప్ఫై అయిదేళ్ళ కంటె ఎక్కువ ఉండవు. బాగానే ఉంటుంది చూడటానికి. నాకు ఎప్పుడూ అలాంటి అభిప్రాయం లేదు ఆవిడని చూస్తే.

శుద్ధ ఇడియట్‌ని నేను. ఆవిడ ఎలాంటిదో ముందరే గ్రహించి నేనూ ప్రయత్నం చెయ్యవలసింది. ఇన్నాళ్ళూ దద్దమ్మలా కూర్చున్నాను, వసుంధరని మాత్రమే చూస్తూ.

ఎవడై ఉంటాడు వాడు, శేషగిరి రావుగారు కాకపోతే? ఎవరున్నారు అయినా? ఎంత ఆలోచించినా పాలవాడు, పోస్ట్ మేన్ తప్ప మరెవ్వరూ నా ఊహకి తట్టలేదు. ఆవిడ ప్రియుడు ఎవరో కనుక్కోలేక పోయాను. కనీసం ఊహించలేక పోయాను. ఏలాగయినా నెరజాణ!

ఆ సందులో అమ్మాయిల్లో చాలా మందికి ఇప్పుడు నా వంక చూడటానికే భయంగా ఉంది. నేను ఏ రావణాసురుడిలాగానో, హిరణ్యకశిపుడి లాగానో కనబడుతున్నాను, వాళ్ళ కళ్ళకి.

నన్ను చూసి నవ్వుకోవటం, నా వెనకాల గుసగుసలు మొదలయ్యాయి. శేషగిరి రావుగారు పూర్తిగా మారిపోయారు. నాతో మాట్లాడటం పూర్తిగా మానేశారు. నన్ను చూస్తే, పొద్దున్నే లేచి పిల్లిని చూస్తే ఎలా మొహం పెడతారో అలా పెడుతున్నారు మొహం.

వెంటనే గది మార్చేశాను నేను. ఆ సందుకి గుడ్‌బై కొట్టి దూరంగా ఇంకోచోట మంచి గది తీసుకున్నాను. కాని ఆ సందులో వాళ్ళు నన్ను దోషిగా, ఏకగ్రీవంగా నిర్ణయించడం మాత్రం నాకు బాగా బాధకలిగించింది.

తరవాత శేషగిరి రావుగారు ట్రాన్స్‌ఫర్‌కు అప్లికేషన్ పెట్టుకున్నారనీ, ట్రాన్స్‌ఫర్ వెంటనే గ్రాంట్ అయిందనీ, విశాఖపట్నం బదిలీ చేశారనీ తెలిసింది నాకు.

కొత్త సందులో, కొత్త అమ్మాయిల మధ్య, కొత్త ప్రియురాలితో, శేషగిరి రావు గారి సంగతి, ఆయన భార్య గురించి, వసుంధర గురించి క్రమంగా ఆలోచించడం మానేసి, మరిచిపోయాను వాళ్ళ సంగతి.

మా నాన్న సంబంధాలు చూడటం, నాకు పెళ్ళవటం సంవత్సరంలో జరిగిపోయింది. వసుంధరతోగానీ, నా కొత్త ప్రియురాలితో గాని పెళ్ళయినా నా భార్య ఏమాత్రం తీసిపోదు.

కాని వసుంధరగానీ, ఆ కొత్త ప్రియురాలు గానీ ఇవ్వలేని కట్నం నా మామగారు ఇవ్వగలిగారు కదా అనే తృప్తి మిగిలింది నాకు.

పెళ్ళయిన కొత్తల్లో వసుంధర గుర్తుకు వచ్చి, బాధపడేవాణ్ణి నేను.


కొత్త భార్య, కొత్త కారు మోజు కొన్నాళ్ళకే పరిమితం. ఎక్కువ రోజులు ఉండదు.

ఇంగ్లీషు సామెత నిజమయింది నా విషయంలో.

మొదటి నెలంతా నేను నా భార్య చెప్పిన మాట విన్నాను. తరవాత నెలంతా నేను చెప్పిన మాట విన్నది నా భార్య. మూడో నెలనుంచి మా ఇద్దరి మాటలూ, కొట్లాటలూ బయటవాళ్ళు వింటున్నారు.

పెళ్ళయిన ఎనిమిది నెలలకి మూడో నెల అని తెలియగానే మళ్ళీ గుర్తుకు వచ్చారు, వసుంధర, వసుంధర వదిన. ఏమయిందో వాళ్ళ సంగతి?

ఎంతో మంచివాళ్ళు శేషగిరిరావుగారు, ఆయన భార్య. వాళ్ళ దాంపత్యం అన్యోన్యత అంటే ఏమిటో తెలిసింది కాదు. వాళ్ళిద్దరు పోట్లాడుకోవడం కాదు,



వాదించుకోవడం కూడా నేను చూడలేదు ఎప్పుడూ. నా భార్య? ప్చ్!

• • •

నాలుగు సంవత్సరాల తరవాత అను కుంటాను, ఒక స్నేహితుడి పెళ్ళికి పిలుస్తే వెళ్ళాను ఆముదాలవలస. ఆ పెళ్ళిలో చూశాను పెళ్ళికూతురూ, పెళ్ళి కొడుకులని కాదు. శేషగిరిరావుగారిని, ఆయన భార్యని.

ఆయనలో ఇదివరకున్న మార్పు ఇప్పుడు లేదు. ఎప్పటిలాగానే ఉన్నారు, నవ్వుతూ.

ఆయన భార్య చేతిలో దాదాపు అయి దేళ్ల పిల్లాడు. తన కొడుకుగా పరిచయం చేసుకున్నాడు అందరికీ.

నా వంక చూసి ముఖం చిట్లించారు ఇద్దరూ. అడిగిన నాలుగు ప్రశ్నలకీ పొడిగా సమాధానం చెప్పి అవతలకి వెళ్ళి పోయారు. ఆశ్చర్యం వేసింది నాకు.

ఎందుకు? ఏమయింది? నేనేం తప్పు చేశాను? బహుశా డాక్టర్ దగ్గరికి వెళ్ళి మళ్ళీ పరీక్ష చేయించుకునిఉంటాడు. లేకపోతే మళ్లీ ఇద్దరూ ఎలా కలవ గలరు?

నా స్నేహితుడికి చెప్పాను ఇదివరకు జరిగింది. అంతా విని నవ్వి అన్నాడు:

"శేషగిరిరావు గారు తొందరపడి ఉంటారు. తరవాత తన సంగతి మంచి డాక్టర్‌కి చెప్పి, పరీక్ష చేయించుకుని, నమ్మకం కుదిరాక, మళ్ళీ ఆవిడని పిలి పించుకుని ఉంటారు. ఈ సంగతి ఆయన్ని అడిగితే బాగుండదు. ఆయన కూడా నాకు ఎప్పుడూ చెప్పలేదు."


ఆవిడని ఒంటరిగా కలుసుకుని మాట్లాడా లనుకున్నాను కాని నన్నే పెదపురుగునో, చీమనో చూసినట్లు చూసింది.

నా తప్పేమిటో తెలియలేదు నాకు.

కాని ఒకటిమాత్రం నన్ను ఆశ్చర్య పరిచింది బాగా. అది కేవలం నా భ్రమో, దృష్టిలోపమో, లేక ఊహాగానమో తెలియలేదు గాని, ఆ అయిదేళ్ల శేషగిరి రావు గారి కొడుకుగా చలామణీ అయే అబ్బాయిలో నా పోలికలు కనిపించాయి నాకే!

ఆరు నెలల తరవాత చాలా అకస్మా త్తుగా, చాలా కాకతాళీయంగా కన పడింది వసుంధర.

కొల్హాపూర్‌లో హోటల్‌లో దిగాను నేను, మా బావమరిది ఉద్యోగం విషయమై వెళ్ళి. అదే హోటల్లో కనబడ్డది, పక్కన ఎవరితోనో. వాళ్ళా యన అయి ఉండవచ్చు అనుకున్నాను,



కాళ్ళకి మట్టెలు, మెడలో మంగళ సూత్రాలు ఉన్నాయి.

నా గదికి నాలుగైదు గదుల అవతలం వాళ్ళ ఉండేది. వసుంధరతో మాట్లాడా లని అనుకున్నాను.

అదృష్టం.

వసుంధరని ఒక్కదానినే వదిలి వెళ్ళాడు అతను బయటికి. తలుపు తట్టాను నేను. చకితురాలయింది నన్ను పోల్చుకోగానే.

"లోపలికి రావచ్చా?" అడిగాను నవ్వుతూ.

"రావచ్చు" అన్నది పొడిగా.

"ఆ రోజే నిన్ను ఆఖరి సారిగా చూసింది. తరవాత అయిపూ, అజా లేకుండా ఏమయిపోయావు? నీకోసరం సంవత్సరం దాకా చూసి చూసి తరవాత పెళ్లిచేసుకున్నాను, నిరాశ చేసుకుని."

నేను చెప్పినదంతా విని మౌనంగా ఉండిపోయింది.

"మీ ఆయనా ఆయన?" అడిగాను

తల ఊపింది.

"ఏం చేస్తున్నారు?"

"దేనికీ?"

"ఊరికే తెలుసుకుందామని.

"అవసరం లేదు."

"కోపం దేనికీ నేనంటే?"

"అబద్దాలాడే వాళ్ళు, అన్యాయం చేసే వాళ్ళంటే నాకూ, అన్నయ్యకీ మొదటినుంచీ కోపమే."

"నేను ఏం అబద్ధం ఆడాను.? ఏం అన్యాయం చేశాను?" అడిగాను ఉక్రో షంగా.

"సంవత్సరం నా కోసం ఎదురు చూశా నన్నావు. అబద్ధం కాదా? అంతకు ముందు నిన్ను వారం రోజులుగా పెళ్ళి చేసుకోమని అడిగితే ఏమన్నావు? గుర్తుందా?"

"అప్పుడు వెంటనే ఏదీ చెప్పలేక పోయాను."

"అప్పుడు నా పరిస్థితి కూడా చెప్పాను నీకు. గుర్తుందా?"

నీళ్ళు నమిలాను నేను.

"అవును."

"నీ మూలంగా మా వదిన కూడా బజారు పాలయింది."

"నీ మీద ఒట్టు. నా మూలంగా కాదు."

"ముమ్మాటికీ నీ మూలంగానే."

"నా మీద ఒట్టు. మీ వదిన చిటికెన వేలయినా ముట్టుకోలేదు నేను. నమ్ము" అన్నాను నేను.

"నీ మూలంగా కాకపోతే నామూలం గా మన మూలంగా."

"మీ అన్నయ్యా, వదినా ఇప్పుడు మళ్లీ కలుసుకున్నట్లున్నారు. బహుశా తన తప్పు తెలుసుకుని ఉంటారు మీ అన్నయ్య. మీ వదినని చేరదీశారు, మంచిదేనని నమ్మకం కలిగాక."

"మా వదిన ఎప్పుడూ మంచిదే. ఆ సంగతి అన్నయ్యకి తెలుసు. నువ్వు చెప్ప నక్కరలేదు."

"మీ వదిన మంచిదని తెలుస్తే మరి ఆ రోజు ఎందుకలా గోల చేస్తారు?"

"చెప్పాగా ఇందాకే?"

"ఏమని?"

"మన మూలంగా. నన్ను కాపాడ టానికి. నా భవిష్యత్తు కోసం."

"అంటే?"

"నీ దగ్గరి కొచ్చి చెప్పాను. పెళ్ళికి ఒప్పుకోలేదు నువ్వు. మా వదినతో చెప్పాను. అన్నయ్యకి చెప్పింది వదిన. వదినే ఆ విధంగా కవలని చేసింది, అన్నయ్యని ఒప్పించి."

"నాకు అర్థం కావటం లేదు, నీవు చెప్పేది ఏమిటో" అన్నాను నేను.

"మా వదిన అన్నయ్యకి చెప్పి ఒప్పిం చింది. నాకు మూడవనెల అప్పుడు. నీ మూలంగా, నా కోసం, పెళ్లికాదని, ఆ నింద తన మీద వేసుకుంది వదిన. అందరి ముందు వదిన దోషిలా నిల బడింది. వదిన దోషిలా అరిచాడు అన్నయ్య వదినతోపాటు నేనూ వాళ్ల ఊరు వెళ్ళాను. అక్కడ పురుడు పోసుకున్నాను నేను. వదినని మగపిల్లవాడితో సహా తిరిగి అన్నయ్య వచ్చి తీసుకు వెళ్ళాడు."

"అంటే ... అంటే ఇప్పుడు మీ వదిన దగ్గరున్న అబ్బాయి నీకు ... మనకు పుట్టిన వాడా?" అడిగాను ఉద్వేగంగా.

"అవును."

"మీ అన్నయ్యకి ఈ పథకం గురించి మొదటి నుంచీ తెలుసా?"

"తెలుసు. తెలిసే నాటకం ఆడాడు. కడుపు తీయించుకోవడం మా ముగ్గురికీ ఇష్టం లేదు. ఎలా? నా సంగతి బయట పడితే పెళ్లి కాదు. అందుకని పెళ్లయిన వదిన ఆ నింద తనమీద వేసుకుని అలా నాటకం ఆడింది. అసలు మా అన్నయ్య ఆపరేషన్ చేయించుకోనే లేదు."

"అలా ఎందుకు చేశారు వాళ్లు?"

"మరి ఎలా చేయాలి ఆ పరిస్థి తుల్లో? అన్నయ్యకి తెలుసు వదిన చాలా మంచిదని. ఇంక ఎవరికి భయపడాలి? లోకులకి. అయినా భయపడలేదు వదిన."

నేను మాట్లాడలేక పోయాను ఏమీ.

"నీ క్కాబట్టి చెప్పాను ఈ రహస్యం. నౌ గెటౌట్" అన్నది శాంతంగా.

"నేనంటే ఇంకా నీకు ప్రేమలేదా? నేను నిన్ను గాఢంగా ..."

"ఐ సెడ్ గెటౌట్" అన్నది వసుంధర శాంతంగానే మళ్ళీ.

వసుంధర వంక చూశాను.

"నేను ఇప్పుడు పద్దెనిమిదేళ్ల వసుం ధరను కాను. పాతికేళ్ళు వస్తున్న వసుంధరను."

"నిజంగా మీ వదిన అలా చేయ గలిగిందా? నమ్మలేకుండా ఉన్నాను. మీ అన్నయ్య అయినా నన్ను అడగలేదే పెళ్ళి సంగతి?"

"అనవసరం అని తెలిసి. మా అన్నయ్య, వదినా మంచి మనుషులు. నీ లాగ చెడ్డవాళ్ళు కాదు."

తల వంచుకుని మౌనంగా నడిచాను.

★